# 17. విప్లవ రామలింగడు

పాపం ! అమాయకులు ! వాళ్ళలో వాళ్ళు తన్నుకు చస్తున్నారు." అని మనమీద జాలిపడి దయ దలచినట్లున్నారు, కేంద్రసాహిత్య అకాడమీలోని ప్రభువరేణ్యులు." ఆలస్యం అయితే, తెలివిమీరిపోయి వాళ్ళంతా కలసి ఏకంగా మనల్నే తంతారేమో అని కూడా సదరు సాహిత్య ప్రభువులు దూరాలోచనచేసి ఉండవచ్చును. ఏమయితేనేం గానీ, చాలా సంవత్సరాలుగా తెలుగువాళ్ళకు సాహిత్యం అంటూ ఉందనే సంగతే మరచిపోయిన ఢిల్లీ సాహిత్య పాదుషాలు ఈసారి తెలుగువాళ్ళ ఓ చమ్కీటోపీని ప్రసాదించేరు.

ఏనాడో ఈ అకాడమీలు పుట్టకముందు శ్రీ శ్రీ వ్రాసిన కవితల్ని నాడు తీరికగా చదివించుకుని విని "ఫర్వాలేదు, బాగానే ఉన్నట్లున్నాయే ? కుర్రవాడు పైకి రాగల వాళ్లాగే ఉన్నాడు, ఇప్పుడే కాస్త మంచి చేసుకుందాం!" అనుకున్నట్లున్నారు.

"నాయనా ! విప్లవం—విప్లవం అంటున్నావు, ఇబ్బందుల్లో ఉన్నట్లున్నావు. ఇందు ! ఓ వంద ఫుల్ బాటిల్స్, ఓ వంద ఫుల్ చికెన్సూ ప్రసాదిస్తున్నాం, అందుకో !" అన్న

ట్లుగా ఆనవాయితీగా పెట్టే సాహిత్య వార్షికాల పద్దులోంచి ఓ అయిదువేల రూపాయల వాయినం ప్రకటించేరు.

ఈ వాయినాల్నీ, వార్షికాల్నీ సదరు శ్రీశ్రీ ఏనాడో హేళన చేసి ఉన్నాడు. అకాడమీల్ని "అగాధమీలు, అనాధమీలు" అంటూ ముద్దు ముద్దుగా వాటిని ప్రశంసించే ఉన్నాడు. "అంధ పరదేశ సాహిత్యాగాధమీలో" తనకోసం వేసిన చందన పీటను లోగడనే విరసం వాళ్ళకు భోగిమంటల్లో వేసుకుని వేడెక్కమని ఉదారంగా దానంచేసి పారేశాడు కూడా.

ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలుగా వర్ధిల్లే సదరు అగాధమీల కన్నింటికి హెడ్డాఫీసయిన ఢిల్లీలోని కేంద్రసాహిత్య అకాడమీ వాళ్ళు ఇప్పుడు శ్రీశ్రీ దగ్గరకొచ్చి "ఫర్వాలేదు తమరూ ఓ కవిలాగే కన్పిస్తున్నారు. ఇదుగో మేం కూడా ఓ సర్టిఫికేట్ ఇస్తున్నాం." అన్నట్టు ఫోజుపెట్టి అయిదు వేలు పుచ్చుకుని తరించమంటున్నారు. పనిలో పనిగా తమ విప్లవాత్మకతను కూడా గుర్తించమంటున్నారు.

"రెండు పెగ్గులు బిగించి, రెండు శ్రీలు ధరించి వెలుగు కవితా విపంచి" అని శ్రీశ్రీని వర్ణించాడో పెద్ద మనిషి. ఆ శ్రీలూ, పెగ్గులూ తరిగినా - పెరిగినా అతను మాత్రం కవి హృదయాల్లో వెలుగుతూనే ఉన్నాడు. నేటికి సరిగా మూడేళ్ళనాడు అతనికి అభిమానులంతా కలిసి ఘనమైన సన్మానం చేసేరు. ఆనాడు దొరికిన శ్రీశ్రీ సమస్త రచనల్నీ పోగేసి ఆరుసంపుటాలుగా అచ్చేసి అతనికే సమర్పించేరు.

ఇది జరిగిన మూడేళ్ళకు మన అకాడమీ దుశ్శాలు వాల శాస్త్రుల్లు నిద్రలేచి మేమూ ఉన్నాం అంటూ బయల్దే రేరు.

శ్రీశ్రీకి ఈ గౌరవాలూ, వేలూ క్రొత్తవేంగావు. కేవలం కవిత్వంతో సినీ వ్యాపారులమీద మెరుపు దాడిచేసి శ్రీని లాకొచ్చి కాళ్ళవద్ద పడేసుకొన్నాడొకనాడు. అంత త్వరగానే అవిడ పరారై పోతే నిర్లిప్తంగా నవ్వుకోగలిగాడు కూడా.

పెగ్గుమీద పెగ్గువేసి ఎవరికీ అక్కర్లేని కవితలల్లి కాలా క్షేపం చేసిన రోజులూ ఉన్నాయి. అందుకు అపాలజీలు చెప్పు కున్న క్షణాలూ ఉన్నాయి.

"తప్పులయితే అందరూ చేస్తారు? త్యాగాలు కొందరే చేయగలరు" గానీ శ్రీశ్రీ తప్పులు సునాయాసంగా చేసేయ గలడు. ఎత్తి చూపితే "అయ్యో! నే చేసింది తప్పన్నమాట? సరే? అయిందేదో అయిందిలే!" అనేసి లెంపలు వేసుకోగలడు అమాయకంగా! అందుకే శ్రీశ్రీ అంటే అందరికీ ఇష్టం.

అది అతి లౌక్యం. అని గిట్టని వాళ్ళ ఉవాచ. కాదు, చిన్నపిల్లల అమాయకత్వం లాంటి నిష్కల్మషత అని అభి మానుల, సమర్ధన. ఏమయినా తిడుతూ కూడా తన నిష్టపడే వాళ్లుండగలగటం అనేది శ్రీశ్రీ ప్రత్యేకతే.

(7)

"సమకాలిక సంఘటనలకు అర్పించే స్వాగతం, పకోడీల పొట్లాలకు పనికొచ్చే కాగితం" అని వ్రాసిన శ్రీశ్రీయే అలాంటి కవిత్వాన్నే వెనకేసుకు రాగలడు. "ప్రపంచాన్ని చూడలేని కవిత నిజం చూపదు. ఇసుకలోన తల దూర్చిన ఉష్ట్రపక్షి బాపతు" అని సమర్థించగలడు.

"నీకొక సిగిరెట్టిస్తా నాకొక శతకమ్ము రాసి నయముగ నిమ్మా!" అని అడిగాడా పెద్దమనిషి. సరేనని ఏదో రాసేశాన్లెండి!" అని తప్పుకోనూ గలడు.

"నాకేమో లోకంలో కాకవులే కానరారు. కవి దూషణ నన్నాకర్షించదు" అంటూనే, "అవురా మన తెలుగింట్లో కవిరాజులు, కవి వరాహ గార్దభ శునకాద్యవతార మూర్తు లెందరో! అ ఆ ఇ ఈ లైన రాని యంబ్రహ్మలు" అనేయ గలడు.

నిన్నటిదాకా మిత్రుడుగా ఉండిన కవిని పత్రికా ముఖంగానే ఏకి పారేయగలడు. అవేం తిట్లు సార్!, అంటే "ఛత్! నేను వాడిని తిట్టనేలేదు. చివాట్లు పెట్టాను! అంతే!" అని మనల్నే మందలించగలడు.

"నా పద్యాలలో నిప్పులు ఇంకా ఎక్కువగా కక్కమంటారా గురూ!" అనడిగిన యువకవికి "అబ్బే! నిప్పుల్లో పద్యాలు కక్కు" అని ఉపదేశించిన శ్రీశ్రీయే, నిప్పులు

కక్కటమే మాపని! ఎలా కక్కా లనేది మా కనవసరం! అని విమర్శకుల్ని డబాయించ గలడు.

శ్రీశ్రీ సర్టిఫికేట్లివ్వటం లోనూ, వాటిని సునాయా సంగా ఉపసంహరించు కోవటంలోనూ కూడా సిద్ధహస్తుడే?

"నీవు రాసేది చాలు! ఇక నేను పద్యాలు రాయక పోయినా ఫర్వాలేదు."

అని ఓ కవిగారికో సర్టిఫికేట్ పారేసి, ఆ తర్వాత "అబ్బే! అతను నా ఆశల్ని ఫలింపజేయలేదు. దారి తప్పి పోయాడు. వియత్నాం యుద్ధంలో అమెరికావాడిలా సమ గ్రాంధ్ర సాహిత్యంలో కూరుకు పోయాడు" అనేయగలడు.

"అభ్యుదయ కవిత్వం నిలవదనేది ఎవడో రెండు పిండి మిల్లు లున్నవాడు అనవలసిన మాట" అని ఉద్ఘాటించిన శ్రీశ్రీయే "అభ్యుదయ కవితకు కాలం చెల్లింది. ఈనాడు కావలసింది విప్లవ కవిత" అని సింహనాదం చేయనూ గలడు.

"మార్కిస్టు ముదిరితే అనార్కిస్ట్" అని ప్రవచించి కూడా అందరివనీ అయిపోయింది. మేమే మిగిలిన, ముదిరిన మార్కిస్టులం అన్నట్లుగా బల్లగుద్ది మాట్లాడనూగలడు.

"మానవుడుగా నేను ఎవరికన్నా ఎక్కువకాను, కవిగా అందరికన్నా అధికుణ్ణి" అనే ఆత్మ విశ్వాసం ప్రదర్శిస్తూనే తనను విమర్శించిన పత్రికకు లేఖరాస్తూ "మీ విమర్శనను

కృతజ్ఞతతో స్వీకరించిబుట్టదాఖలు చేస్తున్నాను." అనివాతలు వేయగలడు.

"తొలి నుండీ విశ్వనాథవారిని గొప్పకవిగా గుర్తించిన వారి జాబితాలో నన్ను నేను సగర్వంగా కలుపుకుంటున్నాను" అని తనకో సర్టిఫికేట్ ఇచ్చుకుంటూనే 'అంత మాత్రాన ఆయన చేసిన, చేస్తున్న, చేయనున్న అవకతవక లన్నింటికీ హారతి పట్టనక్కరలేదు" అంటూ సదరు కవి సామ్రాట్టు క్కూడా ఓ సర్టిఫికేట్ పారేయగలడు.

ఓ ప్రఖ్యాతుని గ్రంథాన్ని సమీక్షిస్తూ "చవకగా గ్రంథాలందించే ఈ ప్రచురణ కర్తలు ఆ చవకదనాన్ని వెలకు బదులు గ్రంథాల్లోని విషయానికే వర్తింపజేస్తున్నట్లున్నారు" అని మర్యాదస్తుల్లా పోజు పెట్టనూగలడు,

"విదూషకుడి Temperament" తనదని శ్రీశ్రీయే రాసుకున్నాడు. కనుకనే కాబోలు ఆయనగారి రాతలు రామలింగడి వాతల పద్ధతిలో ఉండి మింగనూలేని కక్కనూ లేని స్థితిలో పడేస్తున్నాయి. యిష్టుల్ని కూడా.

కనుకనే శ్రీశ్రీ అకాడమీవారి తద్దినపు భోజనాలకు భోక్తగా వెళ్ళినా, వెళ్ళకున్నా అందుకేదో ఒక జోక్ పుట్టించి కాలక్షేపం చేసేయగలడు. అది వేరేమాట, చూద్దాం లెండి.

(మార్చి 1973)